క్లుప్తంగా

వైభవంగా చండీహోమం



మావుళ్లమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు మంగళవారం చండి హోమం నిర్వహించారు .45 మంది దంపతులు ఈ హోమం లో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకివీడులో మున్సిపల్ ఆర్‌డీ పర్యటన



మురుగు తొలగింపును పరిశీలిస్తున్న మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నర్సింహారావు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నర్సింహారావు సందర్శించారు. కార్యాలయంలో ఆయా శాఖల పని తీరు, కార్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం పట్టణంలో మురుగు డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని పరిశీలించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(ఆసుపత్రి)వద్ద ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు. ఆయన వెంట నగర పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన లలిత కళల శిక్షణ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత, భావ వ్యక్తీకరణను పెంపొందించేందుకు లలిత కళలు ఎంతగానో దోహదం చేస్తాయని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం భీమవరం పట్టణం ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో 25 రోజులపాటు నిర్వహించిన ఉచిత లలిత కళల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కేంద్రం సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, వేగేశ్న రమణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, ఎంఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ ఆకస్మిక తనిఖీ



కావలిపురంలో తనిఖీలు చేస్తున్న డీఎల్‌పీఓ

ఇరగవరం: మండలంలోని కావలిపురం పంచాయ తీ కార్యాలయంలో మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారిణి జోతిర్మయి తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి కార్యదర్శి ఎం.యుగంధర్ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జోతిర్మయి మాట్లాడు తూ పంచాయతీ కార్యదర్శి ఎం.యుగంధర్ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలోఈ తనిఖీలు చేపట్టామన్నారు. పంచాయతీ బిల్లులు వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసుకోవడం, సమాచారం అడిగిన వారికి సరిగా సమాధానం చెప్పకపోవడం వంటివి చేస్తున్నారని ఆరోపణలు. ఈతకోట గ్రామానికి చెందిన చిట్టిరాజు కార్యదర్శిని సమాచారం కోరగా సమాచారం ఇవ్వకపోగా దానికి ఎంత ఖర్చవుతుందని అడిగిన సమాచారం ఎన్ని పేజీలు ఉంటుందో తెలియకుండా అతడిని వేలల్లో డబ్బులు కట్టమన్నా రు. దీంతో చిట్టిరాజు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో విచారణ చేశామని డీఎల్‌పీవో తెలిపారు. ఈవిచారణ నివేదికను డీపీవో, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఏవో శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

అహల్యాబాయ్ హోల్కర్ జీవితం ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇండోర్ మరాఠా మహారాణి అహల్యాబాయ్ హోల్కర్ జీవితం ఆదర్శనీయమని బీజేపీ నాయకులు అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఎందరో మహనీయుల చరిత్రను అధ్యయనం చేసి వారి జీవిత విశేషాలను వెలికి తీయడం, ప్రజలకు తెలియజేసేందుకు వీలుగా పట్టణంలో మంగళవారం స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణుడు చెరువు వద్ద మహిళలతో అహల్యాబాయ్ హోల్కర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యాబాయ్‌కు నేతలు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నార్ని తాతాజీ, ఈతకోట తాతాజీ, అయినంపూడి శ్రీదేవి, కోట రాంబాబు, దువ్వా శ్రీనివాస్, వర్తనపల్లి కాశీ, చిట్యాల రాంబాబు, తుమరాడ చిన్న, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి గోతులమయం

- సుమారు 25 కిలోమీటర్లు ఇదే దుస్థితి
- కాలువ పూడికతీత పనుల కారణంగా రహదారిపై మట్టిగుట్టలు



ఉండి శివారులో జాతీయ రహదారిపై మట్టిగుట్టలు.



ఉండి రిజిస్ట్రార్ ఆఫీసు సెంటర్‌లో జాతీయ రహదారిపై గోతులు

ఉండి: నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల పరిధిలో సుమారు 25 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. అయితే పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నట్టు ఉంది జాతీయ రహదారి పరిస్థితి. రహదారి పొడవునా పెద్ద పెద్ద గోతులు, గుంతలతో దర్శనమిస్తుంది. జాతీయ రహదారి అంటే కొత్తగా ఈ రహదారిలో వచ్చే వారు ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తారు. అయితే ఒకసారి ఈ రహదారిలో ప్రయాణించిన వారు దూరమైనా సరే ఇతర రహదారుల్లో వెళ్లిపోవాలని అనుకుంటున్నారు. రహదారిపై అధికారుల పర్యవేక్షణ క్రమంగా లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు పర్యవేక్షిస్తే జాతీయ రహదారి కాస్త మట్టి రహదారిగా ఎందుకు మారుతుంది? అని ప్రశ్నిస్తున్నారు.

ప్రయాణం నరకం

జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులకు నరకం కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన చాన్నాళ్ళకు గోతులు పూడుస్తున్నామని చెప్పి వారి ఇష్టానుసారం పనులు చేశారు. అనంతరం జాతీయ రహదారిపైనా గోతులు పూడుస్తున్నామన్నట్లుగా కొన్ని అధికారులకు ఇష్టమైన చోట ప్యాచ్‌వర్కులు చేశారు. మరికొన్ని మిగుల్చుకున్నారు. అన్నింటినీ ఒకేసారి పూడ్చేస్తే అధికారులకు, కాంట్రాక్టర్లకు తర్వాత పనులు ఉండాలి కదా అని వాహనదారులు జోకులు వేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం ఉండిలోని మహాత్మాగాంధీ సెంటర్ అంటే రిజిస్ట్రాఫీస్ సెంటర్‌లో రెండుగుల లోతులో ఏర్పడ్డ అనేక గోతులు ప్రతిరోజూ పలు ప్రమాదాలకు కారణంగా ఉంటున్నాయి.

జాతీయ రహదారిపై మట్టిగుట్టలు

ఇటీవల ఉండి శివారు కలిసిపూడి గ్రామాల్లో ఉండి పంటకాలువ పూడికతీత పనులను చేపట్టారు. కాంట్రాక్టర్‌కు కనీస పరిజ్ఞానం లేదు అన్నట్లు జాతీయ రహదారిపై బంకమట్టిని గుట్టలుగా వేశారు. మట్టివేసిన రోజుల్లో వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం వర్షాలు రావడంతో జాతీయ రహదారులు కాస్త మట్టిరోడ్లను తలపించాయి. అయితే ప్రస్తుతం కూడా జాతీయ రహదారిపై మట్టి గుట్టలు అలాగే ఉండగా మరికొంత మట్టిని వేసేందుకు కాంట్రాక్టర్ సిద్ధమవుతున్నారు. చెట్ల నరికివేత

ఉండి పొడవునా జాతీయ రహదారి పచ్చని వృక్షాలతో ఎప్పుడూ ఆహ్లాదకరంగా ఉండేది. కానీ ఇప్పుడు ఎక్కడ చెట్టు కనబడినా దానిని కొందరు స్వార్థపరులు కొట్టేస్తున్నారు. ఇటీవల కాలంలో మహదేవపట్నం సత్రం దాటిన తరువాత,భీమవరం సమీపంలోను కొబ్బరిచెట్లు కూడా కొట్టి మోళ్ళు కూడా లేకుండా తవ్వేస్తున్నారంటే అధికారుల అండదండలు ఎంతవరకు ఉన్నాయో? అర్థం చేసుకోవచ్చని వాహనదారులు అంటున్నారు. అలాగే నిద్రగన్నేరు(రైలు)చెట్ల సంగతి మర్చిపోవాల్సిందే. జాతీయ రహదారి పొడవునా ఎన్నో పెద్ద పెద్ద వృక్షాలు ఉండాల్సి ఉండగా ఇప్పుడవి కనుమరుగవుతున్నాయి.

అధికారులు రోడ్డును పట్టించుకోవాలి



జాతీయ రహదారి నియోజకవర్గం పొడవునా సమస్యలకు గురవుతుంటే సంబంధిత అధికారులు ఏమయ్యారు?రోడ్డుపై భారీ ఎత్తున గుంతలు పడుతుంటే కనీసం వాటిని పూడ్చాలన్నా నిధులు లేవా? లేదా అధికారులు కార్యాలయాలకే పరిమితమై పర్యవేక్షించలేకపోతున్నారా? ప్రయాణికులు, వాహనవారులకు ఏది జరిగా అధికారులను బాధ్యులను చేయాలి.

– జంపా నాగేశ్వరరావు,ఉండి

మట్టి గుట్టలు తొలగించాలి



జాతీయ రహదారిపై వాహనదారులు వేగంగా ప్రయాణిస్తారు. అదే సమయంలో రహదారిపై మట్టి ఉంటే ఏం జరుగుతుందో అందరికీ తెలుసు.కాబట్టి ఇప్పుడు రహదారిపై మట్టి ఉండడాన్ని అధికారులు గుర్తించలేక పోతున్నారా? లేక ఎందుకు గుర్తించాలిలే అని అనుకుంటున్నారా?ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన భాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

– బందెల జార్జ్‌రాజు,చెరుకువాడ

డీఎస్సీలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ కోటా అమలు చేయాలి

భీమవరం: ప్రస్తుత డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో సీనియర్ స్టేట్‌లెవల్ క్రీడాకారులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంతో అనేక మంది జిల్లాస్థాయి అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని విజ్ఞాన వేదిక కన్వీనర్ అల్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ అభ్యర్థులకు జిల్లా స్థాయి నుంచి స్పోర్ట్స్ సర్టిఫికెట్స్‌తో డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వవగా ప్రస్తుత డీఎస్సీకి కేవలం సీనియర్ స్టేట్ లెవల్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 421 స్పోర్ట్స్ కోటా పోస్టులను భర్తీ చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అందువల్లే సీనియర్ స్టేట్ లెవన్‌స్థాయిని నిర్ణయించారని విమర్శించారు. ఈ నెల 31వ తేదితో దరఖాస్తు గడువు ముగుస్తున్నందున ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాస్థాయి సర్టిఫికెట్స్ పొందిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని సంజీవ్ నగర్‌లో మంగళవారం నిర్వహించిన ఎక్సైజ్ దాడిలో ఒక మహిళ వద్ద నుంచి రెండు 750 ఎంఎల్ డ్యూటీ పెయిడ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ పునః ప్రతిష్ఠ

అత్తిలి: మండలంలోని కొమ్మరలో శ్రీసీతారామచంద్ర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పంచగవ్య ప్రాశన, మంత్ర హోమం, మన్యుపాశపత అభిషేకం, మూలమంత్ర హోమం, పుష్పాధివాసం, పంచ శయ్యాధివాస పూజలను పురోహితులు కొంపెల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం ఉదయం 8.24 గంటలకు శ్రీసీతారామచంద్ర మూర్తి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు.

యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం

భీమవరం: యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా జిల్లావ్యాప్తంగా యోగా ప్రదర్శనలు, పోటీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం భీమవరం పట్టణంలోని శ్రీచింతలపాటి బాపిరాజు మునిసిపల్ (ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్) స్కూల్లో ఏర్పాటు చేసిన యోగా అభ్యాసన కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, టుటౌన్ సీఐ జి.కాళీచరణ్ పాల్గొని యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.



భీమవరం: ఎస్సీహెచ్‌బీఆర్ఎమ్ స్కూల్‌లో యోగాభ్యాసన కార్యక్రమంలో డీఎస్పీ జయసూర్య

యోగా పై అవగాహనా సదస్సు

కాళ్ల: యోగాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను వివరించాలని ఎంపీడీఓ జి.స్వాతి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు, సచివాలయ సిబ్బందికి అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలందరికీ యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏలూరుపాడు ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ ప్రదీప, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కాళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వాతి

దౌర్జన్యంగా పాక తొలగింపు

కోర్టు ఆదేశాల్ని ధిక్కరిస్తున్నారని దళితుల ఆవేదన

ఆకివీడు: స్థానిక పెదపేటకు చేర్చి ఉన్న ఖాళీ స్థలంలో మునిసిపల్ కార్యాలయం నిర్మించేందుకు ఇటీవల నగర పంచాయతీ అధికారులు ముందుకు వెళ్లగా, ఆ స్థలం తమ క్రైస్తవ సంస్థకు చెందినదని దళితులు కోర్టులో కేసు వేశారు. కమిషనర్ కృష్ణమోహన్ ఆదేశాల మేరకు మంగళవారం శానిటరీ ఇన్స్‌పెక్టర్ సాకేత్, మరికొంత మంది సిబ్బంది కొడవళ్లు, ఇతర వస్తువులతో వచ్చి పాకను తొలగిస్తుండగా దళితులు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత ఏర్పడింది. కమిషనర్ ఆదేశాల మేరకు తొలగిస్తామని సిబ్బంది చెప్పడంతో ఈ అంశం కోర్టులో ఉండగా ఎలా తొలగిస్తారని మహిళలు, క్రైస్తవ యువకులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో మహిళపై శానిటరీ ఇన్స్‌పెక్టర్ చేతులతో నెట్టివేశారని ఆవేదన చెందుతూ మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని నగర పంచాయతీ అధికారులు పోలీసులకు తెలియజేయడంతో ఈ ప్రాంతానికి పోలీసులు వచ్చి శానిటరీ సిబ్బందిని అక్కడ నుంచి తీసుకువెళ్లిపోయారు. ఇదే సమయంలో వాళ్లను తీసుకు వెళ్లడానికి వీల్లేదని, కమిషనర్ వచ్చి సమాధానం చెప్పాలని వారు పట్టుబట్టారు. అనంతరం ఆ ప్రాంత నాయకుడు, పాస్టర్ గూడపాటి జోసఫ్‌రాజు, కౌన్సిలర్లు వంగా జోత్స్న దళితుల్ని సముదాయించి, సిబ్బంది పంపించి వేశారు. అనంతరం తనపై తాకరాని ప్రాంతంలో చేతులు వేసి నెట్టివేశారని శానిటరీ ఇన్స్‌పెక్టర్ సాకేత్‌పై మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ విధులకు ఆటంకం కల్గించారని సిబ్బంది కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇరువర్గీయుల్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్సై హనుమంతు నాగరాజు చర్చించారు.



శానిటరీ సిబ్బందిని, పోలీసులను చుట్టుముట్టిన దళితులు

ఆటో డ్రైవర్‌కు కేంద్రమంత్రి ఆర్థిక సహాయం

భీమవరం: పట్టణంలోని నర్సయ్యఅగ్రహారంలో ఈదురుగాలులు, భారీ వర్షానికి ఆటోపై చెట్టు కూలిన ఘటనలో ఆర్థికంగా నష్టపోయిన ఆటో డ్రైవర్‌కు కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆటో డ్రైవర్ ఏలూరి వినోద్‌కుమార్‌కు ఆటో మరమ్మతుల నిమిత్తం తన వంతు ఆర్థిక సహాయంగా రూ. 25 వేలను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి చేతుల మీదుగా వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నార్ని తాతాజీ, కలిదిండి వినోద్ వర్మ, కాగిత సురేంద్ర, షేక్ మొహిద్దిన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్ కుటుంబస భ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెంలో రైల్వే సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని రైల్వేకు సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను కోరారు. మంగళవారం భీమవరంలోని శ్రీనివాసవర్మ నివాసంలో కలిసి వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

మహిళలకు చీరల పంపిణీ

భీమవరం: మహిళలను చైతన్యపర్చేందుకు విద్య దోహదం చేస్తుందని నమ్మిన మహిళావిద్యా వ్యాప్తికి కందుకూరి వీరేశలింగం పంతులు కృషి చేశారని భీమవరం చాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఛాంబర్ అఫ్ కామర్స్ భవనంలో సంఘసంస్కర్త కందుకూరి వర్ధంతి సందర్భంగా వీరేశలింగం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరుగుతున్న నేపథ్యంలో కందుకూరిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, జవ్వాది దాశరథి శ్రీనివాస్, ఎం.సీతారామ్ ప్రసాద్, ఎస్‌కే చాన్ బాష తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సైబర్ నేరాలపై అవగాహన

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామంలో కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ వాణి విజయరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుజాత మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు చిరునామాలు, ఫోన్ నెంబర్లు, పాఠశాల, వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో ఇవ్వడం గానీ, షేర్ చేయడం గానీ చేయరాదని అన్నారు. ప్రస్తుత కాలంలో సమాజంలో సైబర్ నేరాలు అధికంగా ఉన్నాయని అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి ఉచిత హెల్ప్ లైన్ 1930 నెంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.పార్వతి, కె.సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. డిపో నుంచి నడుస్తున్న సర్వీసులకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు, ఫిర్యాదులు, సలహాలు ఉన్నా 99592 25484 నంబరులో ఉదయం 9 నుంచి 10 గంటల లోపు సంప్రదించాలని కోరారు. ఆర్టీసీ ద్వారా మరిన్ని మెరుగైన సేవలు అందించే విధంగా ప్రయాణికులు సహకరించాలని కోరారు.

డీఈఓను కలిసిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చలం

భీమవరం: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సీహెచ్‌ఎల్‌వీ చలం మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీస్ స్పాట్ వాల్యుయేషన్‌ను బదిలీల ఆప్షన్స్‌ను పెట్టుకునేందుకు వీలుగా వాయిదా వేయాలని, ఎఫ్ఎల్ఎస్ ట్రెనింగ్స్‌ను పాఠశాలల సమయంలో స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించాలని, పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను స్కూల్ అసిస్టెంట్స్ కోరుకునే విధంగా ఉండాలని చలం కోరారు. ఆయన వెంట పీఆర్‌యూటీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బీఎంఎస్ కుమార్, ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖాధికారి నారాయణతో చలం

ఆస్పత్రి సలహా మండలి ప్రమాణ స్వీకారం

తాడేపల్లిగూడెం : స్థానిక ఏరియా ఆసుపత్రి సలహా మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నూతన కమిటీతో ప్రమాణ స్వీకారాన్ని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేయించారు. ఆసుపత్రి సూపరింటెండెంటు తాతారావు, డీసీహెచ్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: మండలంలోని కోలూరు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్‌లైన్ కొత్తగా ఏర్పాటు చేస్తున్న కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కోలమూరు, కలిగొట్ల, పాములపర్రు గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, ఆక్వా రైతులు, పారిశ్రామికవేత్తలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బొండాడలో ఎక్సైజ్ దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని బొండాడ గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం అమ్ముతున్న ఈది ప్రసన్నకుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద 5 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

విస్సాకోడేరు ఇళ్ల లేఅవుట్ పరిశీలన



విస్సాకోడేరు ఇళ్ల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

పాలకోడేరు: పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామం పైపులు చెరువు వద్ద 2021 సంవత్సరం పేదల ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలు ఇచ్చిన లేఅవుట్ స్థలాన్ని మంగళవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా విస్సాకోడేరు గ్రామం పైపులు చెరువు వద్ద 7.64, ఎకరాలలో భాగంగా విస్సా కోడేరు గ్రామానికి చెందిన 164 మంది లబ్ధిదారులకు, వేంద్ర గ్రామానికి చెందిన 127, లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లపట్టాలను ఇవ్వగా వారిలో 29 మంది లబ్ధిదారులు మాత్రమే ఇల్లు కట్టుకోగా మిగిలిన లబ్ధిదారులు ఎందుకు ఇల్లు నిర్మించుకోలేదని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్లు అయ్యాయా?లేదా? అని సంబంధిత అధికారులను అడిగారు. ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు నోటీసులను ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ బి.వెంకటరమణ, తహసీల్దార్ విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ బీవీ నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5న సర్వసభ్య సమావేశం

అత్తిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 5వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీవో పి.శామ్యూల్ తెలిపారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జూన్ 5 ఉదయం 10 గంటలకు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.